జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త. కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 2-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 413 పేజీలు: 4 వెల : రూ.7

# పండగలా.. పింఛన్ల పంపిణీ

* గత ప్రభుత్వం తొలగించిన 1.20 లక్షల పింఛన్ల పునరుద్ధరణ * రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కరోజే 1.09 లక్షల మంది వితంతు పింఛన్లు పంపిణీ * మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్





**కోటబొమ్మాళి/టెక్కలి, ఆగస్టు 1(వార్త):** రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం పండుగ వాతావరణంలో నిర్వహిస్తోందని, ముఖ్యంగా పింఛన్ల పంపిణీని ఘనంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం తులసిపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. రూ.35తో ప్రారంభమైన పింఛను ఇప్పుడు రూ.4 వేలకు పెంచి ఇస్తున్నామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను ప్రభు త్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. 64 లక్షల మందికి పింఛన్ల కోసం ప్రభుత్వం రూ. 34 వేల కోట్లను ఖర్చు చేస్తుందని వెల్లడించారు. గత ప్రభుత్వం తొలగించిన 1.20 లక్షల వితంతు పింఛన్లను తిరిగి పునరుద్ధరిం చామని, ఇతర కారణాలతో తిరస్కరణకు గురైన వాటిని పరిశీలించి అర్హత ఉన్న వారికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఒక్కరోజులోనే 1.09 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వ ఘనత అని తెలిపారు. సంక్షేమ పథకాలలో భాగంగా ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని 47 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, దీనికోసం రూ. 3,156 కోట్లను ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 5 వేలు, కేంద్ర ప్రభు త్వం తరపున రూ. 2 వేలు కలిపి మొత్తం రూ. 7 వేలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీ ఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్ర కుమార్, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఓడినా.. జగన్‌కు బుద్ధి రాలేదు

* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**టెక్కలి, ఆగస్టు 1(వార్త):** ఐదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలిం చడం చేతకాక, ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి, ఆనాటి ప్రతిపక్ష పార్టీ నేతలను, సామాన్య ప్రజలను నానా ఇబ్బందు లకు గురిచేసి, 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమి చెందటం వలన ఆ పార్టీ అధినేత జగన్ రెడ్డికి మతి భ్రమించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో రాష్ట్ర ప్రజలకు అందిస్తూ ఉంటుంటే అది చూసి ఓర్వలేక, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే జీర్ణించుకోలేక ప్రజా ప్రభుత్వంపై జగన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు, కుట్రలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల ఆస్తులను లూటీ చేసి, వేల కోట్లు దోచుకున్న జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు తన అసలైన రూపాన్ని మరోసారి బయటపెట్టారని అన్నారు. రాష్ట్ర మంత్రుల ఇళ్లపై దాడులు చేయండి అనే పిలుపు ఇచ్చిన జగన్ హత్యా రాజకీయాలకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 2024లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు జగన్ రెడ్డికి, ఆయన పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని మంత్రి అన్నారు. కూటమిని గెలిపించి, అభివృద్ధికి, సంక్షేమానికి ఓటు వేశారని, అయినా తన పరాజయాన్ని జీర్ణించుకోలేని జగన్, ఇప్పుడు అశాంతిని రెచ్చగొట్టే కుట్రలు చేస్తుండటం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓర్వలేక బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.



# కల్వర్టు కూలింది

* బోరుభద్ర, నౌపడ ప్రాంతాలకు రాకపోకలు బంద్

**సంతబొమ్మాళి, ఆగస్టు 1 (వార్త):** బోరుభద్ర-పాతమేఘవరం ఆర్అండ్‌బీ రహదారిలో చిదపానిపేట వద్ద వంశధార కాలువపై ఉన్న కల్వర్టు శుక్రవారం కూలిపోయింది. దీంతో ఈ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యం భారీగా పోర్టువాహనాలు, రొయ్యల లారీలు ఈ కల్వర్టుపై రాకపోకలు చేస్తుండడంతో ఇది కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఈ కల్వర్టు కూలడంతో బోరుభద్ర, నౌపడ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే అవకాశం లేక విద్యార్థులు, మత్స్యకారులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

# 13 నుంచి డైమండ్ జూబ్లీ వేడుకలు

* ఈనెల 13 నుంచి 15 వరకూ ఉత్సవాలు * జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు * అధికారులతో సమీక్ష



**శ్రీకాకుళం, ఆగస్టు1 (వార్త):** శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 13 నుంచి 15 వరకు మూడు రోజులపాటు జరిగే డైమండ్ జూబిలీ వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పురోగతిని ప్రతిబింబించేలా ప్రతి కార్యక్రమాన్ని రూపొందించాలని, ప్రజలంతా పాల్గొనాలనిపించేలా ఉత్సవాలు ఉండాలని ఆయన అన్నారు.

## ప్రాథమిక వేడుకల షెడ్యూల్ ఇలా..

ఆగస్టు 13న ఉదయం 10 గంటలకు మున్సిపల్ హైస్కూల్ మైదానంలో వేడుకలు ప్రారంభం. 1950 నుంచి 2025 వరకు జిల్లాలో చోటు చేసుకున్న అభివృద్ధిని ఆవిష్కరించే సాంస్కృతిక ప్రదర్శనలు, నాయకుల ప్రసంగాలు. సాయంత్రం 4 నుంచి 7.30 వరకు ఆర్ట్స్ కాలేజీ రోడ్ నుంచి 7 రోడ్ల జంక్షన్ వరకూ శోభాయాత్ర. ఆదివాసీ తెగల జానపద నృత్యాలు, సంగీతం, వారసత్వ కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణ. రాత్రి 6 నుంచి 10 వరకు ఫుడ్ స్టాల్స్. స్థానిక రుచులు, తెగల మిల్లెట్ ఫుడ్, తీరప్రాంత వంటకాలు అందుబాటులోకి. ఆగస్టు 14న ఉదయం 8 నుంచి సంప్రదాయ క్రీడల పోటీలు. 10 గంటల నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్సే, చిత్రలేఖన పోటీలు. మధ్యాహ్నం 2 నుంచి 6 వరకు థిమ్సా వంటి జానపద నృత్యాలు, స్వాతంత్ర్య పోరాట ఇతివృత్తాల నాటకాలు. సాయంత్రం 6 గంటలకు ప్రముఖుల సత్కారం. రాత్రి 10 వరకు ప్రత్యక్ష వంటల ఫుడ్ ఫెస్టివల్, సాంస్కృతిక సంగీతం. ఆగస్టు 15న ఉదయం 9 నుంచి 12.30 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు. జెండా ఆవిష్కరణ, దేశభక్తి గీతాలు, ముఖ్యమంత్రి ప్రతినిధి ప్రసంగం. డైమండ్ జూబిలీ సందర్భంగా ప్రత్యేక పతాకం ఆవిష్కరణ ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు వెల్లడించారు.

## నగరాన్ని ముస్తాబు చేస్తాం..

వేడుకల సందర్భంగా శ్రీకాకుళం నగరాన్ని ప్రత్యేకంగా అలంకరించనున్నట్టు వెంకటేశ్వరరావు తెలిపారు. అరసవల్లి సూర్యదేవాలయం, రైల్వే స్టేషన్, జాతీయ రహదారి కూడళ్లను ఎల్ఈడీ లైట్లతో, పుష్పాలతో అందంగా ముస్తాబు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ అలంకరణలు వారం రోజులపాటు కొనసాగనున్నాయని చెప్పారు.. సమీక్షలో ఆయా శాఖల అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

## పంద్రాగస్టు వేడుకలకు సిద్ధంగా ఉండండి

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన నేతృత్వంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈనెల 15న ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే వేడుకలు విశిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శాఖ కూడా తమ విభాగానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ సేవల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు మాత్రమే అవార్డుల కోసం సిఫార్సులు పంపించాలన్నారు. అవార్డుల గౌరవాన్ని కాపాడేందుకు పేరు ఎంపికలో ఖచ్చితత్వం పాటించాలని, సంబంధిత వివరాలను ఈ నెల 10లోగా పంపించాలని ఆదేశించారు. వేడుకల సందర్భంగా చిన్నారులు, విద్యార్థులలో దేశభక్తిని పెంచేలా సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించేలా శకటాల ప్రదర్శన, ప్రభుత్వ స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి శాఖ కూడా తమ విభాగానికి సంబంధించిన ప్రగతి నివేదికలను శనివారం సాయంత్రం వరకు సీపీఓ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యం

* పురుగుమందు డబ్బాతో నందిగాం స్టేషన్ వద్ద బైఠాయింపు * నచ్చజెప్పి పంపించిన ఎస్ఐ

**నందిగాం, ఆగస్టు 1 (వార్త):** తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళ నందిగాం పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుల మందు పట్టుకుని ఆందోళనకు దిగింది. వివరాల్లోకి వెళితే.. టెక్కలికి చెందిన జోగి రేణుక కు ఆమె భర్తతో వివాదాలు ఉండేవి. దీనిపై వారిద్దరూ పోలీసులను సైతం సంప్రదించారు. వీరికి కౌన్సెలింగ్ కూడా చేశారు. కేసు కూడా నమోదైంది. లోక్‌అదాలత్‌లో పోలీసులు రాజీ చేయించారు. భర్త తనను, పిల్లలను బాగా చూసుకుంటానని పోలీసుల సమక్షంలోనే హామీ ఇచ్చాడని, రాజీ అయిన తర్వాత పట్టించుకోవడం మానేశాడని రేణుక వాపోయింది. తనకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యమంటూ పురుగుల మందు డబ్బా పట్టుకుని నందిగాం పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయించింది. ఎస్ఐ రాము ఆమెతో మాట్లాడి నచ్చజెప్పి ఇంటికి పంపించివేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

**మందస, ఆగస్టు 1(వార్త):** సిక్కోలు ఉద్దానం సేవా సమితి తన ఉదారతను చాటుకుంది. సంతబొమ్మాళి మండలంలోని ఉదయపురం గ్రామానికి చెందిన సంజీవ్, సరస్వతి దంపతులు టెక్కలి వెళ్తుండగా, మార్గమధ్యంలో ప్రమాదం సంభవించి, భర్త తలకు తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలి గవర్నమెంట్ హాస్పిటల్లో చేర్పించగా, వారు శ్రీకాకుళం రిఫర్ చేశారు. దీంతో శ్రీకాకుళంలో మెడికవర్ హాస్పిటల్లో చేర్చారు. పేద కుటుంబం కావడంతో సిక్కోలు ఉద్దానం సేవా సమితి వారు రూ.10వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. దాతలు కూడా ఆదుకోవాలని కోరారు.



# మీటర్ రీడర్లకు ఎస్క్రో ద్వారా జీతాలు చెల్లించాలి

**-ఏఐటీయూసీ పలాస డివిజన్ ప్రధాన కార్యదర్శి చాపర వేణుగోపాల్ డిమాండ్**



**పలాస, ఆగస్టు 1(వార్త):** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంటు ద్వారానే జీతాలు చెల్లించాలని, వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరి ష్కరించాలని చేయాలని పలాస డివిజన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి చాపర వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పలాస వేదిక కళ్యాణ మండపంలో జిల్లా మీటర్ రీడర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సంస్థలో సుమారుగా 4500 మంది రీడర్లు సుమారు 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారని, వీరందరికీ ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కుదించిన పని దినాలను పెంచాలని కోరారు. పోరాటాల నేపథ్యంలో యాజమాన్యం కొన్ని సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చినా అమలు చేయకపోవడం ఆందోళనకర విషయమన్నారు. కాంట్రాక్టర్లు ఒత్తిడి చేసి బిల్లింగ్ పదో తేదీ నాటికి పూర్తి చేయాలని మీటర్ రీడర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు రావడంతో మీటర్ రీడర్లు ఉపాధి పోయే పరిస్థితి వచ్చిందన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రధాని మోడీ ఆదానికి అప్పజెప్పడానికే విద్యుత్ సవరణ చట్టం తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఆడిచ్చినట్టు ఆడకుండా మీటర్ రీడర్స్ అందరికీ ఉద్యోగ భద్రత కల్పించి ప్రత్యా మ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థకు ఆదాయాన్ని తీసుకొచ్చే మీటర్ రీడర్ల జీవితాలు అంధకారంలో ఉన్నాయని, కష్టపడిన శ్రమకు తగిన ఫలితం మీటర్ రీడర్లకు అందకుండా కాంట్రాక్టర్లు దిగమింగుతున్నారని ఆరోపించారు. ఎస్క్రో అకౌంట్ ఇవ్వకుండా ఏవేవో కుంటి షాకులు చెప్తున్నారని, జిల్లాలో ఉన్న కాంట్రాక్టర్స్ పీస్ రేట్ సక్రమంగా ఇవ్వకుండా మీటర్ రీడర్స్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా మీటర్ రీడర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

**నూతన కార్యవర్గం ఇదే..**

అధ్యక్షులుగా బైపల్లి ఓంకార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దూగాన భాస్కరరావు, పలాస డివిజన్ అధ్యక్షులుగా జీరు ప్రేమ్ భూషణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంఖు చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.

## వికసించిన మందస నాట్య కుసుమాలు



**-శ్రీశైలంలో అబ్బుర పరిచిన నాట్య ప్రదర్శన**

**మందస, ఆగస్టు 1(వార్త):** మందసకు చెందిన నాట్య కళాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వికసిస్తున్నారు. నాట్య కౌశల్యాన్ని ప్రదర్శిస్తూ.. ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకుంటున్నారు. శ్రీశైలంలో నిర్వహించిన ధర్మపథంలో ప్రతిభను చూపి, మన్ననలు పొందారు. ఈ కార్యక్రమానికి మందసలోని శ్రీసాయిమెహర్ నృత్య కళాక్షేత్రం విద్యార్థులు నాట్య కళాకారిణి నారాయణశెట్టి శైలజ ఆధ్వర్యంలో తేజ, కీర్తన, డింపుల్, అక్షయ, లాస్యప్రియ, సంజన, ప్రణవి, పూజిత, గునీషా, ధన్విక, గీతిక, అంజనాశ్రీ, శ్రావణి, విమల, వినీష తరలి వెళ్లారు. వీరు చేసిన మూషిక వాహన, శివోహం, శివతాండవం, అయిగిరినందిని, జతిస్వరం ప్రదర్శనలకు వీక్షకులు ముగ్ధులయ్యారు. వీరికి మందసలోని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# శ్రీముఖలింగ క్షేత్రానికి ముఖద్వారాలు నిర్మించండి



**జలుమురు, ఆగస్టు 1(వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రానికి రెండు వైపులా ముఖ ద్వారాలు ప్రభుత్వ నిధులతో నిర్మించాలని జాయింట్ కలెక్టర్‌ను ఆలయ అనువంశిక అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ కోరారు. శుక్రవారం ఆయన జేసీని తన చాంబర్లో కలిసి వినతిపత్రం అందించారు. 20 ఏళ్లు గా క్షేత్రానికి అభివృద్ధి అంటున్నారు తప్ప, కానీ కనీస మౌలిక సదుపాయాలు, క్షేత్రం ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి స్వాగత ద్వారాలు లేకపోవడం బాధాకరమైన విషయమని వాపోయారు. ఇప్పటికి పదిసార్లు కోరినా ఏ ప్రభుత్వం స్వాగత ద్వారం నిర్మించలేదన్నారు. తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

## 108లో సుఖ ప్రసవం



**మందస, ఆగస్టు 1(వార్త):** చీపి పంచాయతీ పుట్టూరు గ్రామానికి చెందిన సవర కుమారికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. మందస 108 అంబులెన్స్ ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలట్ చిన్నవాడు హటాహుటిన, కుమారిని వాహనంలో తీసుకెళ్తుండగా, వీరగున్నమ్మపురం వద్ద నొప్పులు ఎక్కువ కావడంతో, అక్కడే వాహనం ఆపి సుఖప్రసవం గావించారు. కుమారి పండంటి ఆడబిడ్డకి జన్మనిచ్చింది. తల్లీ..బిడ్డ క్షేమంగా ఉండడంతో, హరిపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అంబులెన్స్‌లో సుఖప్రసవం చేసిన 108 సిబ్బందికి కుమారి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి



**పలాస, ఆగస్టు 1(వార్త):** చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. శుక్ర వారం ఆయన వివిధ వార్డుల్లో సుడిగాలి పర్యటన జరిపారు. కాశీబుగ్గ 17వ వార్డు సాయికాలనీలో రోడ్‌లు స్వీపింగ్ ప్రక్రియను పరిశీలించి, ఎంపీడీవో ఆఫీస్ రోడ్, తిలక్‌నగర్‌ల్లో శానిటేషన్ క్లియర్ చేయించారు. కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్, కేటీ రోడ్డుల్లో శానిటేషన్ పరిశీలించారు. 21వ వార్డు గాంధీనగర్-2లో ఎస్‌బీఎస్ స్కూలు వీధిలో రోడ్డును పరిశీలించారు. 2వ వార్డు సాయిబుల కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను, కొత్త రోడ్లు వేయడానికి గల పరిస్థితులను స్థానికులను అడిగి తీసుకున్నారు. సాయిబుల కాలనీలో పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. ఈ పురపాలక సంఘమునకు ఈనెల కొత్తగా మంజూరు కాబడిన 106 వితంతు పెన్షన్లతో మొత్తము 6091కు గాను ఇప్పటివరకు 5560 పంపిణీ చేశారు. వీధుల్లో డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ ప్రాసెస్‌ను పరిశీలించారు. కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ రోడ్‌లోగల అన్న క్యాంటీన్‌లో అల్పాహారం తిని రుచి చూశారు. నాణ్యత, రుచి చాలా బాగుందని కితాబిచ్చారు.

## సామూహిక వరలక్ష్మి వ్రతాలు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 1(వార్త):** ఇచ్ఛాపురంలోని సత్యసాయిబాబా మందిరంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో 108 మంది మహిళలు, గోపాలరావు, జనార్దనరావు, సుబ్బారావు పాల్గొన్నారు. పెద్ద జగన్నాథ స్వామి దేవస్థానంలో కొలువు తీరిన మహాలక్ష్మి దేవికి శ్రావణ శుక్రవార పర్వదినం సందర్భంగా ఉదయం అభిషేకం, అలంకరణ, కుంకుమ పూజలు జరిగాయి. చామంతి, శంఖుమల్లి, మాలతి తదితర పరిమళ పుష్పాలతో సహస్ర నామార్చన, కుంకుమార్చన, హారతి, మంత్రపుష్పం జరిపారు. మహిళలు సామూహికంగా విష్ణు, లలిత సహస్రనామ పారాయణం చేశారు.

# మాస్టర్ డ్రెయిన్ నిర్మించరూ..!



**పలాస, ఆగస్టు 1(వార్త):** గ్రీవెన్స్ డే సందర్భంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను శ్రీనివాస్ నగర్ కాలనీవాసులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సూది కొండ కాలనీ, రోటరీనగర్ పైభాగము నుంచి ఫారెస్ట్ ఆఫీస్ ఎండీ ఆఫీస్, శ్రీనివాస్ నగర్ కాలనీ ముంపునకు గురయ్యాయి. జన నివాసంలో గల బోర్లు పాడయ్యాయని ఆమెకు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మున్సిపల్ కమిషనర్ ద్వారా ఎస్టిమేషన్ వేయించి డ్రైన్ పనులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు యావారి మోహన్ రావు, పలాస ఏపీ ఎన్జీవో అధ్యక్షులు బోనేల గోపాల్, రమణమూర్తినాయుడు, ఉపాధ్యాయులు కణితి ఈశ్వర రావు, మోస హరినాథ్, పాఠక్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బాలగంగాధర్ తిలక్‌కు ఘన నివాళులు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 1(వార్త):** ఇచ్ఛాపురంలోని శాంతినికేతన్ స్కూల్‌లో చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో బాలగంగాధర్ తిలక్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కే.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, రవి, శాంతి, యశోద, జయలక్ష్మి, మీనా, సరోజిని, పార్వతి, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియ, సెక్రటరీ డి.హర్షవర్ధన్ రెడ్డి, ఎస్.పి.ఎల్. జిహారిక, యువశ్రీ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఐసీడీఎస్ పీఓగా పెద్దింటి అరుణ



**మందస, ఆగస్టు 1(వార్త):** ఐసీడీఎస్ మందస ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పెద్దింటి అరుణ బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం-మన్యం జిల్లా ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై మందస ప్రాజెక్ట్‌కు సీడీపీఓగా నియమితులయ్యారు. గతంలో పనిచేసిన కె.వసుంధరాదేవి సోంపేటకు బదిలీపై వెళ్లిపోయారు. కాగా ఆమె స్థానంలో బాపట్ల నుంచి సీడీపీఓను నియమించగా, ఈ వ్యవహారం వివాదం అయ్యింది. జిల్లాలు దాటి వచ్చి, ఆమె మందసలో ఉద్యోగం ఎలా చేస్తారని స్థానికులు ప్రశ్నించారు. దీంతో రెగ్యులర్ సీడీపీఓగాగా అరుణను నియమించారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందితో పాటు, స్థానికులు అభినందనలు తెలిపారు.



## పార్టీలకతీతంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

**పలాస, ఆగస్టు 1(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా (స్పౌజ్) పెన్షన్లను రాష్ట్ర ఏపీటీపీఎస్ చైర్మన్ బాబూరావుతో కలిసి పలాస-కాశీబుగ్గ టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డా నాగరాజు, సప్ప నవీన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాసకు చెందిన నర్తు మోహినమ్మ భర్త ఇటీవల మృతి చెందారు. ఆమె కుమారుడు పట్టణ వైకాపా ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నప్పటికీ, పార్టీలకతీతంగా ఆమెకు కేవలం రెండు నెలల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందించామన్నారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు ఈ ఘటనే నిదర్శనమన్నారు.

## నీలావతిలో సామాజిక భవనం ప్రారంభం



**పలాస, ఆగస్టు 1(వార్త):** నీలావతి గ్రామంలో గ్లో సంస్థ, నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ సౌజన్యంతో మంజూరైన రూ.15లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష, గ్లో కార్యదర్శి వెంకన్న చౌదరి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కొత్తగా మంజూరైన స్పౌజ్ పెన్షన్స్ పంపిణీ చేశారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## తల్లీ పాల వారోత్సవాలు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 1(వార్త):** తల్లిపాల వారోత్సవాలు రత్తకన్న, జగన్నాథపురం, పురుషోత్తపురం కేంద్రాలలో శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ పనితీరు, సేవలు, ఉద్దేశం, లక్ష్యంపై లబ్ధిదారులు, తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాల ఆవశ్యకత గూర్చి వివరించి, వెల్ బేబీషో నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రాజెక్టు ఆఫీసర్ సుజాత, సూపర్‌వైజర్ నీలవేణి, కార్యకర్తలు సుభద్ర, జ్యోతి, రాణి, చంద్ర, స్వాతి, సంధ్య, సీత, గంగ, రష్మిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పౌజ్ పింఛన్లు పంపిణీ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 1(వార్త):** ఇచ్ఛాపురం 17వ వార్డులో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఐదు స్పౌజ్ పింఛన్లను వార్డు ఇన్‌చార్జి జన్నెల సంతోష్ యాదవ్, సచివాలయ సిబ్బంది రాజేశ్వరి, విల్సన్.. లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. కేసుపురం పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీ రావు, డి.కామేశ్వరరావు, గుజ్జు భీమరాజు, పిట్ట పురుషోత్తం, కార్యదర్శి సంతోష్ కుమార్ అందజేశారు. 15వ వార్డులో కమిషనర్ రమేశ్, మాజీ కౌన్సిలర్ నందిగం సరస్వతి, కోటి పంపిణీ చేశారు. 11వ వార్డులో కౌన్సిలర్ ఆశి లీలారాణి సచివాలయం సిబ్బంది హుస్సేన్, జీనాత్ పింఛన్లు అందించారు.



# ప్రజా ఫిర్యాదులు పెండింగ్ ఉండరాదు

**- ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి**

**-కాశీబుగ్గ పోలీసు స్టేషన్లో ఫిర్యాదుల స్వీకారణ**

పలాస, ఆగస్ట్ 1, (వార్త): ప్రజా ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలని ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతీ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో, శుక్రవారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్లో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఆయన కాశీబుగ్గ పోలీసు స్టేషన్లో ప్రజలు వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదిదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదిదారుల అర్జీలు, వాటి వివరాలు పోలీసు అధికారులకు తక్షణమే తెలియజేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక ద్వారా పంపించాలని ఎస్పీ తెలిపారు.



# రైతులకు ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు అందించాలి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 1(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రైతులకు ఇప్పటికే అందాల్సిన ఎరువులు కనీసస్థాయిలో కూడా సరఫరా జరగకపోవడం దురదృష్టకర మని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 7734 ఎకరాల్లో వరి పంటకు సుమారు 195 టన్నుల యూరియా, 150టన్నుల డీఏపీ అవసరం, కాగా కేవలం 100 టన్నులు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. కంచిలి మండలంలో 8500 ఎకరాలకు 200 టన్నుల యూరియాకు 120 టన్నులు మాత్రమే అందుబాటులో ఉందని, సోంపేట మండలంలో 9000 ఎకరాలకు గాను 200 టన్నులు అందుబాటులో ఉందని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి జిల్లాలో ఎటువంటి ముందస్తు ప్రణాళిక లేకపోవడం విచారకరమన్నారు. గతంలో ఈ సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సరఫరా జరిగేదన్నారు. కానీ నేడు రైతు సేవా కేంద్రాలకు తాళాలు వేసుకొని అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను పెన్షన్లు పంపిణీకి ఉపయోగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎరువులను రైతులందరికీ అందివ్వా లని కోరారు.

# అబద్ధాల రాయుడు.. చంద్రబాబునాయుడు

**మూలిపాడులో బాబు ష్యూరిటీ-**

**మోసం గ్యారంటీ విజయవంతం**

**మందస, ఆగస్టు 1(వార్త):** అబద్దాల రాయుడు.. చంద్రబాబునాయుడు అని, బాబు ష్యూరిటీతో ప్రజలకు మోసం చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయ కుడు, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, సరస్వతి దంపతులు ధ్వజమెత్తారు. మూలిపాడులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ సర్పంచ్ గుసిరి వెంకటరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ డొక్కరి దానయ్య, పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరావు, సర్పంచ్ వెంకటరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రజలను నిలువునా మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎంత నష్టపోయారో పార్టీ నాయకులు ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు ఎంత మోసానికి గురవుతున్నారో ప్రజలకు తెలిపారు. చంద్రబాబును రీకాల్ చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు మొబైల్ ఫోన్ లో చూపించారు. 2024 ఎన్నికల సమయంలో బాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుంగా ప్రజలను బాబు మోసం చేశాంన్నారు. బాబు మోసపూరిత హామీలను ప్రజలకు వివరించారు. భిన్నలమదనాపురంలో జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో మార్పు భవాని, మార్పు కృష్ణ మూర్తి, ఎంపీటీసీ కంచి బెహరా, దువ్వ జగదీష్, పిట్ట భీమారావు, గుసిరి నాగేశ్వర రావు, బొందల వెంకటరావు, బైలాడుచైని, కలిగాన ప్రశాంత్, టెంక నవీన్, ఇళ్ల భోగేశ్వరరావు, నెయ్యిల గురునాథం, బుదియాసాహు, తెలుకుల జగన్నాథం, మెట్టూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# పచ్చదనం.. పర్యావరణ హితం



**పలాస, ఆగస్టు 1(వార్త):** పర్యావరణహితానికి పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త, గ్లో సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకన్నచౌదరి పిలుపునిచ్చారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ నెహ్రూ పార్కు (ముత్యాలమ్మ కోనేరు)లో స్థానిక వాకర్స్ క్లబ్ సభ్యులతో కలసి శుక్రవారం ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతాపం నుంచి రక్షణ పొందడంతో పాటు మానవులకు అవసరమైన ప్రాణవాయువు చెట్ల నుంచి పొందవచ్చన్నారు. ఇప్పటికే గ్లో సంస్థ ద్వారా పలు పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. పార్కు వాకర్స్ క్లబ్ సభ్యులు పలు సమస్యలను పరిష్కరించాలని ఆయనకు విన్నవించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పండిత్ రాజేంద్ర, కార్యదర్శి ధడియాల నరసింహులు, కోశాధికారి లండ నాగరాజు, వాకర్స్ క్లబ్ సభ్యులు రాము పాత్రో తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం



**పలాస, ఆగస్టు 1(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాసలో గల తన కార్యాలయంలో శుక్రవారం ఆమె నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ వినతులపై తక్షణం స్పందిస్తూ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లు, కాలువల నిర్మాణం వంటి కనీస వసతులపై అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కనీస వసతులను కల్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

# ఆక్రమణ..మళ్లీ..మళ్లీ..!

### -అండదండలు అందిస్తున్న రెవెన్యూ అధికారులు -కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

### -ఆర్డీవో చర్యలు చేపట్టమన్న కిమ్మనని వైనం-చిన్న జొన్నవలసలో రెచ్చిపోతున్న ఆక్రమణదారుడు



**ఆమదాలవలస, ఆగస్టు 1 (వార్త)**

వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఆమదాల వలస మండలం చిన్నజొన్నవలసరెవెన్యూలోని రైతుల నుంచి ప్రభుత్వం భూ సేకరణ చేసి నష్టపరిహారం చెల్లించింది. నిర్వాసితుల ఇళ్లకు కేటాయించగా మిగి లిన కొంత భూమిలో ఆ గ్రామస్తుడు సుమారు 18 సెంట్లు ఆక్రమించేశాడు. ఆ స్థలం విలువ రూ.50 లక్షల వరకు ఉంటుంది. ఆ భూమిని నిర్వాసితులకు ఇచ్చిన వారు ఆక్రమణదారుడిపై కలెక్టర్ ఫిర్యాదు చేసినంతవరకు గ్రామస్థాయి రెవెన్యూ అధికారి నుంచి మండల స్థాయి అధికారుల వరకు ఎవ్వరూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కలెక్టర్ ఆదేశాలతో ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టారు. కానీ ఆక్రమణదారుడు వారి హెచ్చరికలను కూడా లెక్క చేయకుండా రెవెన్యూ అధికారుల అండదండలతో హెచ్చరిక బోర్డు తీసివేసి పట్టుకెళ్లిపోయారు. కానీ గ్రామస్థాయి రెవెన్యూ అధికారి నుంచి మండలస్థాయి వరకు ఆయనకు ఉన్న సంబంధాలతో వారు మౌనంగా ఉన్నారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే కలుగ జేసుకొని మండల తహసీల్దార్‌కు ఫోన్ చేసి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆక్రమణదారుడిపై పోలీస్ కేసు పెట్టారు. బైండోవర్ సిద్ధం చేశారు. రెండోసారి మళ్లీ అదే స్థలం లో హెచ్చరిక బోర్డు రెవెన్యూ వారు పెట్టారు. కానీ ఆక్రమణదారుడు తనకు సహకరించిన రెవెన్యూ అధికారులు కొంతమందితో మాట్లాడి ఆ హెచ్చరిక బోర్డును మళ్లీ తీసివేసి కందులు పంట వేసి చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేశారు. కానీ రెవెన్యూ అధి,కారుల్లో కనీస స్పందన లేదు. అన్ని పత్రికల్లో ఆక్ర మణదారుడిపై కథనాలు రావడంతో, విషయం తెలు సుకున్న శ్రీకాకుళం ఆర్డీవో చర్యలు చేపట్టమని తహసీల్దార్‌ను ఆదేశించినప్పటికీ ఇంతవరకు ఆక్రమ ణదారుడిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తక్షణమే కలెక్టర్ ఈ విషయంపై స్పందించి దర్యాప్తు జరిపించి, ప్రభుత్వ ఆస్తులు సంరక్షణలో విఫలమైన అధికారులపైన, ఆక్రమణదారుడిపై చర్యలు చేపట్టా లని నిర్వాసితులు, ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.




## అమ్మ పేరిట ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 1(వార్త):** భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ మై భారత్ / నెహ్రూ యువకేంద్ర సంఘటన్, న్యూఢిల్లీ ఆదేశాల మేరకు శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఎక్ పెడ్ మా కా నామ్ అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలి అనే కార్యక్రమం ఇచ్ఛాపురం డిగ్రీ కాలేజీలో చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి శ్రీనివాసరావు, అధ్యాపక బృందం మరియు విద్యార్థి, విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు హంగర్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

## ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా రాజేశ్వరి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 1(వార్త):** ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఎం.రాజేశ్వరి శు క్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నర్సీపట్నం నుంచి ఇక్కడ కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన నాగరాణికి శ్రీకాకుళంకి బదిలీ కాగా ఇప్పటివరకు ఇన్‌చార్జి పీవోగా సూపర్‌వైజర్ సుజాత వ్యవరించారు.

## కృష్ణమూర్తి రెడ్డి పుట్టినరోజు వేడుకలు




**ఇచ్ఛాపురం, ఆగస్టు 1(వార్త):** శాంతినికేతన్ స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ సెక్రటరి డి.ఇందిరారెడ్డి, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, రోటరీ క్లబ్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఇచ్ఛాపురం సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థి దశ నుంచే మంచి నడవడిక ఏర్పరుచుకోవాలి

### -మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్

**మందస, ఆగస్టు 1(వార్త):** విద్యార్థి దశ నుంచే మంచి నడవడిక ఏర్పరుచు కోవాలని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందసలోని శ్రీరాజా శ్రీనివాసా స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నిజం చేయాలని కోరారు. చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్లకు అలవాటు పడవద్దని, ఆన్లైన్ గేమింగ్స్, బెట్టింగ్‌లు ఆడవద్దని సూచించారు. సంకల్పం, నారీశక్తి, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌ను వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఘనంగా భాస్కరరావు జన్మదిన వేడుకలు





**శ్రీకాకుళం, ఆగస్టు 1 (వార్త):** రొక్కం భాస్కరరావు జన్మదిన వేడుకలను శ్రీకాకుళం నగరంలో ఘనంగా నిర్వహించారు. పీజే బ్లడ్ సెంటర్‌లో భాస్కరరావుతో పాటు మరికొందరు రక్తం దానం చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్‌తో పాటు పలువురు భాస్కరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలనరసింహ, డాక్టర్ రమణ, పొట్లూరు ప్రతాప్, రొక్కం భాస్కర్ పీజే నాయుడు బ్లడ్ సెంటర్‌కు చెందిన కృష్ణకిషోర్, కిమ్స్ సిబ్బంది గోపీ, శ్రీను, రాజు, గణేష్, విసు, లోకేష్, హరీష్, దీప, యశ్వంత్, పవన్, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546